క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన జీఆర్‌కే పంత్ రూ.లక్ష 116లు విరాళాన్ని అందించారు. సంబంధిత నగదును సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో నగదు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు పీఆర్వో కార్యాలయ సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్‌ను అందించారు. అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను బహూకరించారు.

చురుగ్గా దివ్యాంగ పిల్లల సర్వే


బాలికను పరిశీలిస్తున్న ఎస్‌ఎస్‌ఏ కో ఆర్డినేటర్ గీత

ఆరిలోవ: చినగదిలి మండలంలో దివ్యాంగ పిల్లల సర్వే చురుగ్గా జరుగుతోందని సర్వ శిక్షా అభియాన్(ఎస్‌ఎస్‌ఏ) జిల్లా కో ఆర్డినేటర్ గీత తెలిపారు. తోటగరువు ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ప్రస్తుతం అక్కడ ఎంత మంది దివ్యాంగ పిల్లలున్నారో కేంద్రం టీచర్ షేక్ సలీమాను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీచర్‌తో కలిసి ఆమె ఆరిలోవలో దివ్యాంగ పిల్లల కోసం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించడం కోసం చినగదిలి మండల పరిధిలో ఈ నెల 13 నుంచి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇది జూన్ 9తో ముగుస్తుందన్నారు. సోమవారం ఆరిలోవలో ఇద్దరు దివ్యాంగ పిల్లలను గుర్తించి, భవిత కేంద్రంలో చేర్పించినట్లు చెప్పారు. ఇంతవరకు మండలంలో ఏడుగురు ప్రత్యేక అవసరాల గల పిల్లలను సర్వేలో గుర్తించినట్లు తెలిపారు. దివ్యాంగ పిల్లలున్న వారు భవిత కేంద్రాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు. మానసికంగా ఎదుగుదల లేని 1 నుంచి 18 ఏళ్ల పిల్లలను గుర్తిస్తున్నామన్నారు. భవిత కేంద్రంలో వారికి ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.


యువతి అదృశ్యంపై కేసు

ఎంవీపీకాలనీ: మద్దిలపాలెం కేఆర్‌ఎం కాలనీకి చెందిన ముస్కాన్ దుంగర్వావల్ అనే యువతి అదృశ్యంపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. కేఆర్‌ఎం కాలనీకి చెందిన పన్నాలాల్ దుంగర్వాల్, ఊర్మిళ దుంగర్వాల్ దంపతులకు ఇద్దరు పిల్లలు. చిన్న కూతురు ముస్కాన్ దుంగర్వాల్ ఎంవీపీ కాలనీలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఈ నెల 18వ తేదీ ఆదివారం తల్లిదండ్రులు ఇంట్లోని వేరే గదిలో నిద్రపోతుండగా.. మరో గదిలో ఉన్న ముస్కాన్ ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. సాయి అనే అబ్బాయితో ఇటీవల ముస్కాన్ ఎక్కువగా మాట్లాడుతున్నట్లు సమాచారం. యువతి కోసం తల్లిదండ్రులు, బంధువులు పలు చోట్ల వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో ఊర్మిళ దుంగర్వాల్ సోమవారం ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఒక వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. ఘటన వివరాలిలా.. చినవాల్తేరు రెల్లి వీధికి చెందిన చెన్న మౌనిక తన భర్తతో గొడవ పడి సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం వరకు వేచి చూసినా రాకపోయే సరికి ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన స్వరమంజరి


పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట: అపర్ణ మెలోడీస్ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన స్వరమంజరి మధుర గీతాల కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. సంస్థ గాయనీ గాయకులు పాత సినిమాల్లోని హిట్ సాంగ్స్ ఆలపించి ఉర్రూతలూగించారు. సత్యానందం, వి.వి.చారి, గంటి ఉష, శ్రీదేవి, రుద్రవేణి, మెరాజ్, కేశవరావు, కె.లక్ష్మణరావు సినీ గీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు.

తీరంలో తిష్ట

మందుబాబులకు అడ్డాగా సాగర తీరం

- ఇసుక తిన్నెలపై నిత్యం మందు పార్టీలు
- బీచ్ వెంబడి మద్యం సీసాల దర్శనం
- ఇబ్బంది పడుతున్న పర్యాటకులు, నగరవాసులు
- దృష్టి సారించని అధికారులు


మందుబాబులకు అడ్డాగా మారిన వైఎంసీఏ ఎదురుగా సాగర తీర ప్రాంతం


సాగర తీరంలో రాళ్ల వెనుక తాగి పడేసిన మద్యం సీసాలు


తీరంలోని రాళ్ల మధ్యలో పదుల సంఖ్యలో మద్యం సీసాలు


తాగి పడేసిన మద్యం సీసాలు

ఏయూక్యాంపస్: మందుబాబులకు అడ్డాగా సాగర తీరం మారుతోంది. రాత్రి వేళల్లో తీరంలోని ఇసుక తిన్నెలు వీరు మందు పార్టీలు చేసుకునే వేదికలుగా నిలుస్తున్నాయి. వీరు తాగి పడేసిన మద్యం సీసాలు తీరంలో దర్శనమిస్తూ నగర ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నాయి. వీఎంఆర్‌డీఏ పార్కు వెనుక సాగర తీరం నుంచి ఆర్కే బీచ్ వరకు ఈ పరిస్థితి కనిపిస్తోంది. ప్రముఖ పర్యాటక ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు నెలవవడంతో పర్యాటకులు, నగరవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

అడుగేస్తే మద్యం సీసా..

సాగర తీరంలో అడుగడుగునా ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా వెలుతురు తక్కువగా, నిర్మానుష్యంగా ఉండే ప్రాంతాలు మందుబాబులకు నిలయాలుగా నిలుస్తున్నాయి. నిత్యం రాత్రి వేళల్లో మద్యం ప్రియులు, ప్రధానంగా యువత నేరుగా మద్యం సీసాలు తీసుకుని తీరానికి చేరుకుంటున్నారు. స్నేహితులతో కలిసి మందు తాగుతూ అక్కడే గడుపుతున్నారు. తరువాత వారు తెచ్చుకున్న మద్యం, బీర్ బాటిళ్లను అక్కడే పడేసి వెళ్లిపోతున్నారు. దీంతో తీరంలో ఎక్కడ చూసినా మద్య సీసాలే దర్శనమిస్తున్నాయి.

నిఘా పెంచాలి..

బీచ్ రోడ్డులోని నిర్మానుష్య ప్రాంతాలు, చీకటిగా ఉండే ప్రదేశాల్లో అవసరమైన మేర విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి. మద్యం తాగడానికి అనువైన ప్రాంతాలుగా ఉన్న వాటిని గుర్తించి పోలీస్ నిఘా పెంచాలి. సాగర తీరంలో పేరుకుపోతున్న మద్యం సీసాలు, గాజు పెంకులు వంటివి ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. సాగర తీర భద్రత విషయంలో అధికారులు, పారిశుధ్య విభాగం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పర్యాటకులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా సీసా పెంకులు

మందుబాబులు మద్యం తాగి ఖాళీ సీసాలను తీరంలోనే పడేయడంతోపాటు పక్కనే ఉన్న రాళ్లపై వేసి పగులు గొడుతున్నారు. దీంతో ఇవి ముక్కలై ఇసుకలో కూరుకుపోతున్నాయి. బీచ్‌లో నడిచే వారికి ఇవి గుచ్చుకుంటున్నాయి. కొంత మంది ఇసుకలో చెప్పులు లేకుండా నడవడం, తిరగడం చేస్తుంటారు. అటువంటి సమయంలో వీరికి తీవ్ర గాయాలయ్యే అవకాశాలున్నాయి. విరిగిన గాజు సీసాలు తొలగించకుండా అక్కడే వదిలేస్తున్నారు. ఇవి ప్రమాదాలకు కారణమవుతాయి. పరధ్యానంగా ఎవరైనా వీటిపై కాలు వేస్తే కోసుకోవడం ఖాయం. పలువురు చిన్నారులు సైతం నిత్యం బీచ్‌లో ఆడుకుంటారు. వారికి కూడా పగలిన మద్యం సీసాలు ప్రమాదకరంగా మారే అవకాశముంది.



బీచ్‌లో పాదరక్షలు తీసి నడుస్తున్న యువకులు

పర్యాటకంపై దెబ్బ..

సాగర తీరంలో ఇవే పరిస్థితులు, పరిసరాలు దర్శనమిస్తుంటే పర్యాటక రంగం కొంతమేర దెబ్బతింటుంది. కుటుంబాలతో వచ్చే వారు మద్యం సీసాలను చూస్తే వారి అభిప్రాయం మారుతుంది. ఈ ప్రాంతం సురక్షితం కాదనే భావన వారిలో కలుగుతుంది. ఇదే జరిగితే పర్యాటకుల సంఖ్య తగ్గే అవకాశముంటుంది. దీని ప్రభావం విభిన్న రంగాలపై పడటంతో పాటు రాష్ట్ర ఆదాయానికి గండి పడే అవకాశం ఉందని పలువురు స్థానికులు చెబుతున్నారు.

నేడు కనకమ్మ పండగ

- విద్యుద్దీపాలంకరణతో ముస్తాబైన చినవాల్తేరు వీధులు

చినవాల్తేరు వీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణలు

ఏయూక్యాంపస్: చినవాల్తేరులో కొలువైన కనక మహాలక్ష్మి(కనకమ్మ) ఆలయ వార్షిక పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. వీధులన్నీ విద్యుత్ కాంతులతో ధగధగ మెరిసిపోతున్నాయి. మంగళవారం అమ్మవారి పండగ జరగనున్న నేపథ్యంలో ఆలయాన్ని, చినవాల్తేరు వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే వారు విద్యుద్దీపాలంకరణలను చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భారీ ప్రభల వద్ద స్థానికులు ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నారు. ఆలయానికి వెళ్లే దారి పొడవునా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో పోరాటాలు


పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: పేదల సంక్షేమం కోసం పుచ్చలపల్లి సుందరయ్య ఎన్నో పోరాటాలు చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ అన్నారు. పుచ్చలపల్లి 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం 10వ వార్డు ఆరిలోవ బీఎస్‌ఆర్ నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుమార్ మాట్లాడుతూ భూస్వామి కుటుంబంలో పుట్టిన పుచ్చలపల్లి నిరంతరం పేదల కోసం పోరాడుతుండేవారన్నారు. కుటుంబం నుంచి తన వాటాగా వచ్చిన ఆస్తిని పార్టీకి అందజేశారని చెప్పారు. దున్నేవాడిదే భూమి నినాదంతో తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించారన్నారు. పార్లమెంట్‌లో మొదటి ప్రతిపక్ష నేతగా ఉంటూ ప్రజలకు ఉపయోగపడే సంస్కరణలు చేపట్టారని గుర్తుచేశారు. సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఆయన స్ఫూర్తితో సీపీఎం నాయకులు పోరాటాలు, సేవా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు నరేంద్రకుమార్, నాగరాజు, రమణ, చంద్రమౌళి, సూరిబాబు, ముత్యాలమ్మ, రాధాబాయి, లక్ష్మి పాల్గొన్నారు.

జైల్‌లో పటిష్ట రక్షణ చర్యలు


జైల్ సూపరింటెండెంట్ మహేష్‌బాబు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. ఖైదీల కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాల సంఖ్యను పెంచుతున్నట్లు జైలు సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు తెలిపారు. గతంలో 9 సీసీ కెమెరాలు ఉండగా, ప్రస్తుతం అదనంగా 32 కెమెరాలు ఏర్పాటు చేయడంతో 41 కెమెరాలు పనిచేస్తున్నాయి. జైలు విస్తీర్ణం దృష్ట్యా మరో 300 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న కెమెరాల ఫుటేజీలను నిరంతరం పరిశీలిస్తూ ఖైదీల ప్రవర్తనను గమనిస్తున్నామని, ఇటీవల ఒక ఖైదీ షేవింగ్ కిట్ దాచడం సీసీ కెమెరాల ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. జైలులో పూర్తిస్థాయి రక్షణ చర్యలు ఏర్పాటు చేస్తామని సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

రౌడీమూకల దాడిపై కేసు


బీరు బాటిల్స్ విసురుతున్న రౌడీ మూకలు

ఎంవీపీకాలనీ: లాసన్స్ బే కాలనీ శాంతి ఆశ్రమం భూముల్లో రౌడీ మూకల దాడికి సంబంధించిన వీడియో వైరల్ అయింది. కొన్నేళ్లుగా అక్రమంగా వినియోగించుకుంటున్న కొందరు గత నెలలో ఆ భూములను శాంతి ఆశ్రమానికి అప్పగించారు. సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత ఆశ్రమం యాజమాన్యం భూమిని దక్కించుకున్నప్పటికీ, ఆక్రమణదారుల ఆగడాలు కొనసాగుతున్నాయి. ఇటీవల ఆ భూముల్లో పనిచేస్తున్న ఆశ్రమానికి చెందిన వారిపై ఆక్రమణదారుడు సిద్ధార్థ్ పంపిన రౌడీ మూకలు రాళ్లు, బీర్ బాటిళ్లతో దాడి చేశారు. జాలరిపేట శ్మశానవాటిక రోడ్డు వైపు నుంచి ఆశ్రమానికి అప్పగించిన భూముల్లో పనులు చేస్తున్న వారిపై దాడి చేస్తున్న వీడియో వైరల్ అయింది. ఈ ఘటనపై ఆశ్రమం ప్రతినిధులు ఈ నెల 15న ఫిర్యాదు చేయగా, ఎంవీపీ పోలీసులు సిద్ధార్థ్‌తో పాటు రౌడీ మూకలపై కేసు నమోదు చేశారు. వీడియోలో ఉన్నవారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బౌండోవర్ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆందోళన


రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: నగరంలో పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపల్లి పైడిరాజు డిమాండ్ చేశారు. సీపీఐ మధురవాడ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పేదలు రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కూటమి నాయకులు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలన్నారు. రెండు సెంట్ల స్థలాలతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ పేదల చేత డిప్యూటీ తహసీల్దార్ జి.రాజేష్‌కు వినతిపత్రాలు అందించారు.

ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ పేదల సొంతి ఇంటి కలను నిజం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. 2024 ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కేటాయించిన నగరంలో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో ఒకటిన్నర సెంట్లు ఇళ్ల స్థలాలు చాలవని, వాటిని రెండు, మూడు సెంట్లకు పెంచి కేటాయిస్తానని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి అయ్యాక చంద్రబాబు ఆ హామీని పక్కనపెట్టేశారని విమర్శించారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడా అమలు కావడం లేదన్నారు. మహిళలు, విద్యార్థులు, రైతులకు ఎలాంటి సహకారం అందడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రెహమాన్, నాయకులు పాల్గొన్నారు.

ఐఎన్‌ఎస్ కురుసుర వద్ద పార్కింగ్ స్థలం కేటాయించండి


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన తెడ్డు శంకరరావు

మహారాణిపేట: బీచ్ రోడ్డులోని ఐఎన్‌ఎస్ కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం పక్కన వాహనదారుల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేయాలని మత్స్యకారుల యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు తెడ్డు శంకరరావు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ ప్రాంతాలను సందర్శించడానికి నిత్యం ఎంతోమంది పర్యాటకులు వస్తున్నారని, వీరు ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని శంకరరావు సమస్యను వివరించారు. ఇక్కడ సరైన పార్కింగ్ సదుపాయం లేకపోవడం వల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారని, ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడేలా పార్కింగ్ ప్రదేశం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

బస్టాపా.. పార్కింగ్ స్థలమా!


సిరిపురం - రామ్‌నగర్ రహదారిలోని బస్టాప్‌ల వద్ద అడ్డంగా పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు

బీచ్‌రోడ్డు: ప్రయాణికుల కోసం నిర్మించిన బస్టాప్‌లు వాహనాల పార్కింగ్ స్థలాలుగా మారుతున్నాయి. ప్రయాణికులు కనీసం బస్టాప్‌లోకి వెళ్లేందుకు వీలు కూడా లేకుండా ద్విచక్ర వాహనాలను నిలిపి వేస్తున్నారు. పేరుకే బస్టాప్ కానీ.. అది వాహనాల పార్కింగ్ స్థలంలా మారింది. సిరిపురం నుంచి రామ్‌నగర్ వైపునకు వెళ్లే రహదారిలోని 14 నంబర్ బస్టాప్ వద్ద పరిస్థితి ఇది. ఇక్కడ ప్రయాణికులు సేద తీరేందుకు, వేచి ఉండేందుకు మూడు బస్టాప్‌లను నిర్మించగా.. వాటి ఎదురుగానే వాహనాలను పలువురు ఇష్టారాజ్యంగా పార్క్‌చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు బస్టాప్‌లోకి వెళ్లే అవకాశం కూడా లేకుండా పోతోంది. ఇక్కడి రాంగ్ పార్కింగ్‌పై తమకేం పట్టనట్లు ట్రాఫిక్ పోలీసులు వ్యవహరిస్తున్నారు. ఈ బస్టాప్ వద్ద ఇబ్బందికరంగా వాహనాలు నిలపకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

సరస్వతీ నిలయం చెంత.. చెత్త పనులు


శివాజీపాలెం ప్రాథమిక పాఠశాల వద్ద మద్యం సీసాలు


స్కూల్ గోడ వద్ద పడేసిన చెత్త

బీచ్‌రోడ్డు: పిల్లలు చదువుకునే పాఠశాలలను కూడా మందుబాబులు, ఆకతాయిలు వదలడం లేదు. స్కూళ్లకు వేసవి సెలవులు కావడంతో వారి అసాంఘిక కార్యకలాపాలకు వాటిని అడ్డాగా మార్చుకుంటున్నారు. ఇందుకు నిదర్శనమే శివాజీపాలెం ప్రాథమిక పాఠశాల పరిసరాలు. ఈ స్కూల్ ప్రహరీ చుట్టూ మద్యం సీసాలే దర్శనమిస్తున్నాయి. స్థానికులు తమ ఇళ్లలోని చెత్తను కూడా పాఠశాల గోడ వద్దే పడేస్తున్నారు. అక్కడ పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాల్సిన జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పాఠశాల పరిసరాలు అధ్వానంగా మారి దుర్వాసనతో నిండిపోతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి శివాజీ పాలెం ప్రాథమిక పాఠశాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బీచ్ రోడ్డులో బురద


బీచ్ రోడ్డులో కోస్టల్ బ్యాటరీ జంక్షన్ వద్ద బురద పేరుకుపోయింది. ఆ రహదారిలో వాహన చోదకులు ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు మాత్రం ఈ రోడ్డును శుభ్రం చేయడం లేదు.

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం